*అతను ఎవరికోసం 'నీతి' పరీక్షలో నిలిచి గెలిచాడో, ఆమె అవినీతి పరురాలయితే ఆ కథ పేరు "నీతి నవ్వేసింది" అయినా కావచ్చు.*

ఆడది తాగుతుందని చలపతి చాలాసార్లు విన్నాడు! ఐతే, ఆడది తాగడం అతనెప్పుడూ చూడలేదు. కానీ, ఇదిగో, ఇప్పుడు చలపతి చూస్తున్నాడు!

* * *

చలపతికి ఆంధ్రదేశంలో చాలా గొప్ప పేరుంది. చాలా గొప్ప పేరుంది గనుక అతను ధనవంతుడు కా . పారిశ్రామికవేత్త కాదు! రాజకీయనాయకుడంతకంటేనూ కాదు.

"మరి గొప్ప పేరెలా వచ్చింది?

అతను కథలూ, నవలలూ రాసి చాలా స్వల్పకాలంలోనె గొప్పపేరు సంపాయించాడు.

అతని ప్రేమకథలు చదివి, అతన్ని ప్రేమించిన ఆడపిల్లలు దేశంలో చాలామంది వున్నారు.

# రంభ నవ్వేసింది



సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ గజే కడం గరీయేం తః।
జారే రాజని వా పునః।
పాపకృత్సు చ విద్వత్సు।
నియంతా జంతు ర్న తకః

ఏనుగు చెలరేగి విజృంభించినా, రాజు జారుడైనా, విద్వాంసులు పాపకృత్యాలు చేసేవారయినా—యిక వారిని హద్దులలో వుంచే శక్తి కలవారెవ్వరు?

కంఠస్థం చేయాలి

ఐతే, ఇన్ని ప్రేమకథలు రాసినా చలపతి ఎవరిని ప్రేమించలేదు

ప్రేమించకుండానే పెద్దలు నిర్ణయించిన పెళ్ళిచేసుకుని, ఆ తర్వాత గీతను ప్రేమించసాగాడు.

*   *   *

మద్రాసునుంచి కరుణా ఆర్ట్సువారు టెలిగ్రాం ఇస్తే వెళ్ళాడు చలపతి.

కరుణా ఆర్ట్సువారు ఇప్పటికి నాలుగైదు సినిమాలు తీశారు. ఆరో సినిమాకు చలపతిని రచయితగా నిర్ణయించి, నగరంలో పెద్ద ఖరీదైన హోటల్లో విడిది ఏర్పాటు చేశారు.

మొదటిరోజు పరిచయాలూ, పలకరింపులూ ఐన తర్వాత నిర్మాతగారు పెదపార్టీ ఏర్పాటు చేశారు. ఆ పార్టీలో ఆ పిక్చర్లో నటించబోయే హీరో, కెమెరామన్, మేకప్ మన్, డైరెక్టరూ అందరూ పాల్గొన్నారు.

అందరూ చాలా సరదాగా, జోక్సుకట్ చేసుకుంటూ, దిగులనేదేమిటో తెలియని గొప్ప మనుషుల్లా ఆ పార్టీలో గడిపారు.

ఈ సందడీ, హంగూ, ఆర్భాటం చలపతి ఎప్పుడూ చూసి ఎరుగడు! అతను సినిమా వాళ్ళతో పరిచయం కావడం యిదే మొదటిసారి.

ఈ నాగరికతలో యిమడలేక యిబ్బందిగా ఫీలవ్వసాగాడు చలపతి. ఇది గమనించి కాబోలు నిర్మాతగారు వొచ్చి-

"మీకేం కావాలో చెప్పండి? క్వీన్ ఆఫ్ క్వీన్స్, బ్లాక్ నైట్, ఆర్ వ్హాట్...."

"సారీ సర్! నాకేం వొద్దు. మీరు కానివ్వండి."

"మీరు మొహమాటపడకండి చలపతి గారూ. మీకేం కావాలో చెప్పండి?"

ఏం వొద్దు సార్!"

నిర్మాతగారు చిద్విలాసంగా నవ్వి హీరో గారి దగ్గర కెళ్ళారు.

తింటూ తాగుతూ, తాగుతూ తింటున్న వారినందరినీ చలపతి గమనిస్తూ కూర్చున్నాడు.

ఆ రోజు ఎలాగో గడిచిపోయింది.

రెండో రోజు కథ చర్చమీద కూర్చున్నారు.

రాత్రి పార్టీలో వున్నవారంతా వున్నారు.

చలపతి సాధ్యమైనంతవరకూ జాగ్రత్త పడుతూ. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూనే కథలో సన్నివేశం, అందులో సందర్భానుసారంగా వచ్చే డైలాగులూ అన్నీ చెప్పసాగాడు.

దాదాపు నాలుగు గంటల తర్వాత అందరూ తృప్తిగా లేచి. ఆవేళ్టికి విశ్రాంతి తీసుకున్నారు.

*   *   *

చలపతి మద్రాసు వచ్చి పదిరోజులు కావస్తోంది. వారం రోజులు అతను బాగానే వుండి. అనుకున్న ప్రకారంగానే సినిమాకు డైలాగులు రాశాడు కాని, కొన్ని ముఖ్యమైన సన్నివేశాలకు యింకా రాయవలసి వుంది.

కొన్ని రోజుల క్రితం వున్న వుత్సాహం ఇప్పుడతన్లో లేదు!

అనుక్షణం అతనికి భార్యా, ఇద్దరు పిల్లలూ గుర్తురాసాగారు.

ఇంట దగరున్న రోజుల్లో నయితే అందరూ కలసి భోజనాలు చేసేవారు. పిల్లలు పడుకున్న తర్వాత, తను రాయబోయే కథ గురించి భార్యతో చర్చించి రాయడం మొదలు పెట్టేవాడు. ఒక్కోరోజు తెల్లవారేదాకా రాస్తూనే వుండేవాడు!

ఇప్పుడతనికి భార్యా, పిల్లలూ లేరు

ఖరీదైన ఈ గదిలో ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తూ రాయవలసిందే!

చలపతి రాయాలని కాయితం, పెన్నూ తీసుకున్నాడు.


## వివేకవంతులకు మానసిక వ్యాయామం

ఎంట్రీ ఫీజు లేదు

మీరు తప్పక ఒక బహుమతి గెలుపొందగలరు.
షుమారు 1000 బహుమతులు పంచిపెట్టబడును.

ఉదాహరణకు
మొత్తం 24

| | | |
|---|---|---|
| 5 | 10 | 9 |
| 12 | 8 | 4 |
| 7 | 6 | 11 |

(1) కొత్త మోడలు రాజ్‌దూత్ మోటార్ సైకిల్ లేదా టెలివిజన్, 2వ బహుమతి (2)గ్యారంటీడ్ ఎక్కువ మీడియం వరల్డ్ సౌండ్ మార్షల్ ట్రాన్సిస్టర్ ధర రు. 260/- మాత్రమే. 3వ బహుమతి (3) అఖిలభారత హెవీ డ్యూటీ ట్రాన్సిస్టర్ ధర రు. 185/-. బహుమతులు సగం ధరపై ఇవ్వబడును. ప్రమోటర్ల తీర్మానము న్యాయమైనది.

| |
|---|
| 12 |
| 10 |
| 8 |

ఖాళీలలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడి నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటుకూడిగా మొత్తం 30 వచ్చునట్లు నింపండి. బహుమతి గెలిచినవారు పోస్టేజీ, ప్యాకింగ్ & లైసెన్సు ఫీజు చెల్లించాలి. ఫలితం కొరకు ఎంట్రీలు 40 పైసల స్టాంపులతో హిందీ లేక ఇంగ్లీషులో పంపండి

ఆఖరి ముగింపు తేది 10-9-78

Radio Sindicate (G-6) Gandhi nager, DELHI-31

"నాన్నా!"

రాయబోతున్న చలపతి ఆగిపోయాడు.

"నాన్నా" అని పిలుస్తున్నది తన పిల్లే!—ఈ పిలుపు పదేపదే గుర్తు రాసాగింది.

వాచీ చూసుకున్నాడు. రాత్రిపదిగంటలు దాటింది. ఈపాటికి పిల్లలు భోజనంచేసి. నిద్రపోతూ వుంటారు. మరి. గీత?—చదువుకునే వుంటుంది. లేదా, పుస్తకం ముందేసుకుని తనను ఆలోచిస్తూ కునికిపాట్లు పడుతూ వుంటుంది.

తను యింటికి వెళ్ళాలంటే కనీసం యింకా పదిరోజులైనా యిక్కడ వుండాలి తప్పదు!

చలపతి రాయాలని ముందుకు జరిగాడు

ఉహూ...! ఒక్క అక్షరం కూడా రాయలేక పోయాడు!

తెల్లారుతూనే నిర్మాతగారు వొచ్చి —

"ఏమండీ కవిగారూ! మనం అనుకున్న సీన్లు రాశారా?" అన్నాడు.

"లేదండి"

"రాస్తానన్నారుగా?"

"రాయలేకపోయానండి."

"ఎందుకని?"

"మూడ్ సరిగ్గా లేదు."

"మూడ్ సరిగ్గా లేదా?" నిర్మాతగారు నవ్వి మళ్ళీ అన్నారు.

"మూడ్ అదే వస్తుందండి. వొచ్చేటు నేనూ చూస్తానుగా. మీరు ప్రయత్నం చెయ్యండి" వస్తా.

* * *

రాత్రి పదిగంటలు దాటింది.

చలపతి హోటల్ గదిలో ఒక్కడే వుండి, రాయవలసిన సన్నివేశం తాలూకు డైలాగులకోసం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఇంతలో బెల్ మ్రోగింది.

లేచి వెళ్ళి తలుపు తీశాడు.

ఒక అప్సర. ఒక మెరుపుతీగ చొరవగా లోపలకొచ్చి తలుపు వేసేసింది.

ఆమె ఎవరో చలపతికి అర్థంగాక ఆశ్చర్యంగా చూసి ఆ తర్వాత - "మీరెవరు?" అన్నాడు.

"రంభను. మీరు రాస్తున్న సినిమాలో డానర్ని"

"ఐతే?"

రంభ నవ్వింది. అలా నవ్వినప్పుడు అందమైన ఆమె పలువరుస తళుక్కున మెరిసింది. ఖరీదైన మత్తైన సువాసనలు ఆమె శరీరం మీద నుంచి వొస్తున్నాయి.

"మీకు మూడ్ లేదటగదా! ప్రొడ్యూసరుగారు చెప్పారు."

నవ్వింది. రంభ అలా నవ్వుతుంటే చాలా బావుంది. కళ్ళు సగం మూసుకుపోయి. బుగ్గలు సొట్టలుపడి. గలగలా శబ్దం చేస్తున్న గులకరాళ్ళలావుంది.

"మీరు కూర్చోమనక పోయినా నేనే కూర్చుంటున్నాను. అభ్యంతరం లేదు కదా?"

"కూర్చోండి."

అతని కెదురుగా కూర్చుంది. తను తీసుకొచ్చిన భోషాణంలాటి బ్యాగ్‌ను కుర్చీ ప్రక్కన పెట్టి.

"మీరు డైలాగులు చాలా బాగా రాస్తు


| | | |
|---|---|---|
| స్పెషల్<br>సినీ పజిల్<br>నెం-35 | **విజయ సాహితి** (సినీ పజిల్)<br>మండపేట, తూ॥గో॥జిల్లా<br>**రు. 60,000 లు గెలుపొందండి!**<br>ఆల్ కరెక్టు రు. 40,000 లు 1,2 తప్పులు రు. 10,000 లు<br>మినీ సాహితి రు. 10,000 లు | ముగింపు : 7-8-78<br>కి సొల్యూషన్ : 13-8-78<br>"ఆంధ్రజ్యోతి" దిన పత్రికలో. |

1 ఎంట్రి 1-00 | 6 ఎంట్రీలు 4-00 | 25 ఎంట్రీలు 15-00

ప్రతి 6 ఎంట్రీలకు 1 మినిసాహితి ఉచితం (మిని సాహితి 1. 2. 3. 4. 5. 6 ప్రశ్నలు ఆల్ కరెక్టుకు మాత్రమే)

ఆధారములు : 1. ఇటీవల రామారావు-నాగేశ్వరరావు కలిసి నటించిన ఈ చిత్రం ఆశించినంతగా ప్రజాదరణ పొందలేకపోయింది-(చంద్రగుప్త/రామకృష్ణులు) 2. విజయా సురేష్ సంస్థ ఈతనిని దర్శకునిగా తెరకు పరిచయం చేసింది-(K.బాపయ్య/B.సుబ్బారావు) 3. గతంలో సూపర్ స్టార్‌గా వెలుగొందిన ఈమె ఇటీవల కేరక్టర్ పాత్రలు పోషిస్తుంది-(సావిత్రి/కృష్ణకుమారి) 4. ఈతడు నటుడైనా ఒక చిత్రంలో పాట పాడాడు-(రాజబాబు/పద్మనాభం) 5. 10 వ మాస్కో చలనచిత్రోత్సవంలో ప్రదర్శించిన తెలుగు చిత్రం-(నోము/ఓ మనిషీ తిరిగి చూడు) 6. విలన్ పాత్రలేని ఈ సాంఘిక చిత్రం నేటికీ సవాల్‌గానే నిలిచింది-(దేవదాసు/చిరంజీవులు) 7 నారద పాత్రకు తెరపై సజీవ రూపకల్పన చేసిన ఘనత ఈతనికి దక్కింది-(కాంతారావు/K. రఘురామయ్య) 8. కథానాయకునిగా ఈతడు ఎక్కువ చిత్రాలలో నటిస్తున్నాడు-(కృష్ణ/మురళీ మోహన్) 9. నటుడు చంద్రమోహన్ ఈ చిత్రంలో గొప్పగా నటించాడని చెబుతారు-(సిరిసిరిమువ్వ/సీతామాలక్ష్మి) 10. ఈ సంస్థ నిర్మించిన మొదటి చిత్రమే 100 రోజుల పండగ జరుపుకుంది-(సత్యచిత్ర/గోపీకృష్ణ) 11. ఇటీవల రాష్ట్రపతి రాజభవనంలో. ఈ చిత్రాన్ని చూసి ఎంతగానో ప్రశంసించారు-(చిరంజీవి రాంబాబు/అమరదీపం) 12 ఈ నటునికి చిత్రసంస్థే కాకుండా నాటక సంస్థ కూడా ఉంది-(నాగభూషణం/పద్మనాభం),

నిబంధనలు : 1. మీరు కోరుకునే పదములు వరుసగా వ్రాసి పంపండి. 2. రుసుము క్రాస్ చేయని I.P.O. ద్వారాగాని, M.O. ద్వారాగాని పంపుతూ M. O. రశీదు తప్పక జతపర్చాలి. 3. M. O. రశీదు లేని ఎంట్రీలు, ముగింపు తరువాత చేరు ఎంట్రీలు పోటీకి తీసుకోబడవు 4 మేనేజిమెంటువారిదే తుది నిర్ణయం. 5. స్టేట్ బ్యాంకు లాకరులో సీలు చేయబడి, గ్రామాధికారుల సమక్షంలో తెరువబడే కీ సొల్యూషన్‌తో పరిశీలని ప్రతిమాట ఒక తప్పుగా లెక్కించబడును 6 విజేతలలిస్టుకు పోటీ నెం.36 (తృతీయ వార్షికోత్సవం) ఎంట్రీలకు 40 పైసలు స్టాంపులు పంపండి. మీ ఎంట్రీలు M. O. లు-

**VIJAYA SAHITHI, MANDAPETA,** E. G. Dt కు పంపండి.

న్నారని ప్రొడ్యూసరుగారూ, డైరెక్టరుగారూ మహా ఆనందపడిపోతున్నారు. తర్వాత పిక్చరు క్కూడా మిమ్మల్నే పెట్టుకోవాలనుకుంటున్నారు?"

ఆ మాటకి చలపతి సంతోషించినమాట వాస్తవమే. కానీ, ఆ రాత్రి సమయంలో రంభ తన గదిలో వుండటం ఎవరికైనా తెలిస్తే....?

"ఉదయమే మీ దగ్గరకు రావాలనుకున్నాను. పగలయితే "మూడ్"గా వుండదని యిప్పుడొచ్చాను. మీరు రాస్తూవుండండి. నేను మీ ప్రక్కన కూర్చుని......." రంభ నవ్వేసింది.

రంభ అలా నవ్వుతుంటేనూ, ఆమె ఒంటినుంచి వచ్చే సువాసనలూ, ఆమె అందం చలపతిని పిచ్చివాణ్ని చేస్తున్నాయి. నిగ్రహించుకోవాలని ప్రయత్నం చేస్తున్నా సాధ్యపడేట్టు లేదు

"మీ కథలు చదువుతూ వుంటాను. ప్రేమ ఘట్టాలను చాలా బాగా రాసే మీరు ఎలా వుంటారో చూడాలని అనేకసార్లు అనుకున్నాను. ఇప్పుడు చూశానుగదా! మీరు చాలా బావున్నారు — ఇంగ్లీషు హీరోలా."

రంభ కూర్చున్న చోటునుంచి లేచి, చలపతి ప్రక్కన కూర్చుని అతని చేతిని తన చేతిలోకి తీసుకుని—

"నేచెప్పింది అవునా? కాదా?" అన్నది.

చలపతి నవ్వి వూరుకున్నాడు.

ఆమెముందు, ఆ అప్సరముందు ఏం మాట్లాడాలో తెలియడంలేదు! మాటలురాని మూగవాడిలా ఐపోయేట్టున్నాడు.

"వుండండి. మీకు చక్కని "మూడ్" నిచ్చే టానిక్ నాదగ్గరుంది" అంటూ రంభ ఆ భోషాణంలాటి బ్యాగ్‌లోంచి ఖరీదైన విస్కీసీసా ఒకటి తీసింది.

చలపతి చూస్తూ వుండగానే, ఆమె చకచకా అన్నీ అమర్చి విస్కీ ద్రవాన్ని గ్లాసులోకి వొంపి—

"కమాన్" అంది.

ఆమె చేసిన ఈ చర్యకు చలపతి ఆశ్చర్యపోవడమేకాదు. అసహ్యించుకున్నాడు కూడాను. రంభను ఈ గదిలోంచి వెళ్ళిపోవలసిందిగా పెద్దగా అరవాలనుకున్నాడు. అలా అంటే, ఆమె ఏం గొడవచేస్తుందోనని తమాయించుకొని, చిన్నగా నవ్వి—

"నాకు అలవాటులేదు. మీరు కానివ్వండి" అన్నాడు.

"సిగ్గుపడకండి. ఈ గదిలో మనిద్దరమే ఎవరికి తెలియదు, కమాన్" అంటూ రంభ చలపతి చేతిని పట్టుకుని ముందుకులాగింది.

చలపతి లేచి, ఆమె చేతిని విడిలించుకుని—

"మీరు తాగుతూ వుండండి. నేను చూస్తూవుంటాను. ఆడవాళ్ళు తాగడం నేనెప్పుడూ చూడలేదు. మీరు తాగుతూ మాట్లాడుతూ వుండండి. నాకు థ్రిల్‌గా వుంటుంది" అన్నాడు.

ఈ మాటకి ఆమె పకపకా నవ్వేసి—

"ఏవిటో అనుకున్నాను. అన్నీ హీరో లక్షణాలే" అంటూ చలపతిని క్రీగంట చూసి, గ్లాసులో వున్న విస్కీని తాగడం మొదలుపెట్టింది.

చాలాసేపు గడిచింది. బాటిల్లోవున్న విస్కీ ఐపోవచ్చింది. అప్పుడే రంభ తలెత్తింది. ముఖం అలసిపోయి, చిరు చెమట పట్టింది. కళ్ళు విచిత్రంగా మూతలు పడుతున్నాయి. పెదవులమీద తాగిన విస్కీ తాలూకు చుక్కలు నిలచి తళతళ్ళాన మెరుస్తున్నాయి.

రంభ తూలుతుంటూ చలపతి దగ్గర కెళ్ళి—


ఉచితము ఉచితము ఉచితము

## తెల్ల మచ్చలు

మా వైద్యము ద్వారా తెల్లమచ్చ రంగు సమూలంగా త్వరితగతిని మామూలుగా మార్చును. మా వైద్యము ఎంత సఫలమైనదో పరీక్షచేసి చూడండి. రోగ వివరములు మాకు వ్రాసి ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా తెప్పించుకోండి.

## తెల్ల వెంట్రుకలు

పొగడ్త కాదు, మా ఆయుర్వేద తైలము వాడుటవలన వెంట్రుకలు తెల్లబడుట ఆగిపోయి సమూలంగా నల్లగా మార్చును. ఈ తైలము మెదడు మరియు కండ్ల బలహీనతలకు లాభదాయకమైనది. వేలమంది ప్రజలు దీనిని వాడి, లాభము పొంది యున్నారు. ఒక సీసా వెల రు. 10/- 3 సీసాల వెల రు. 28/- పోస్టేజి అదనం.

MRITYUNJAY SUDHA OWSHADHALAYA,
(A.J) (P.o) Katrisari (Gaya)



(లైసెన్సు అవసరంలేదు)

దృఢమైనమెటల్‌తో తయారుచేయబడి అతి పెద్ద శబ్దం మరియు మిరుమిట్లు గొలుపు మంటతో మిమ్ములను దొంగలు మరియు క్రూరమృగముల బారినుండి రక్షించుతుంది.




ఫోల్డింగ్ 50 గుళ్ళ హెవీ డ్యూటీ ఆటోమాటిక్ మేజర్ 50 ధర రు. 59-50 పోస్టేజి మరియు ఇన్సూరెన్సు చార్జీలు రు. 8-50. 200 గుళ్ళు & లెదరు కేస్ ఉచితం. అదనపు ప్రతి 100 గుళ్ళకు రు. 5-00. 5-00 అడ్వాన్సుతో మీ ఆర్డరుకు పంపండి.

SHOOTWELL INDIA (M-AJWV)
Railway Road, Aligarh.



రు. 1000/- విలువగల బహుమతులు గెలవండి. ఎంట్రీ ఫీజు లేదు.

బహుమతులు : వాచీలు, కెమెరాలు, టేపు రికార్డర్సు, రికార్డ్ ప్లేయర్సు, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్. (ఏదో ఒక బహుమతి) కన్సొలేషన్ బహుమతికి : అమెరికన్ డిజైన్‌చీర లేక జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ అమ్మకందరపైఇతర వాటితో వేరుగావున్నదానికి మొదటిబహుమతి. అదేవిధంగా వున్నదానికి కన్సొలేషన్ బహుమతి ఇవ్వబడును. ఇది అమ్మకంఅభివృద్ధి పథకం. ప్రమోటర్ల తీర్మానం ఖాయమైనది మరియు న్యాయరీత్యా చట్టబద్ధమైనది.

సహాయమునకు 42

| | | | |
|---|---|---|---|
| 3 | 18 | 15 | 6 |
| 13 | 8 | 9 | 12 |
| 10 | 11 | 14 | 7 |
| 16 | 5 | 4 | 17 |

నిబంధనలు : తెల్లకాగితముపై గడులను నమూనాలో వున్న విధంగా తయారుచేసి 6 (ఆరు) నుండి 21 (ఇరవై ఒకటి) వరకుగల అంకెలను ఒకేసారి మాత్రమేవాడి ఎటుకూడినా మొత్తం 54 (ఏభైనాలుగు) వచ్చునట్లు వేయాలి. బహుమతి గెలిచినవారికి పోస్టేజి, ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. ఇంటిమేషన్ లెటర్‌లో తెలియపర్చిన విధంగా బహుమతులు పంపబడును. ఒక కుటుంబం ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. మా కార్యాలయమునకు మొదటగా చేరిన ఎంట్రీకు రు. 101/- ప్రత్యేక బహుమతి ఇవ్వబడును. జ్యూరిస్ డిక్షన్‌లో ఢిల్లీలో మాత్రమే. ఈ ప్రకటన ప్రచురింపబడిన తరువాత 30 రోజులలో ఎంట్రీలు చేరాలి.

Phillipyne Sales (WAJ) P.B. 9408 DELHI-51

"కమాన్ డార్లింగ్! ఈ రాత్రిని రాత్రిగా వుంచకండి. మీకు "మూడ్" లేదన్నారట గద ప్రొడ్యూసర్‌గారితో, నావల్ల మీకు తప్పకుండా "మూడ్" వస్తుంది. కమాన్" అంటూ అతన్ని గట్టిగా కౌగలించుకుంది.

ఊహించని ఈ పరిణామానికి చలపతికి నోటమాట రాలేదు! రంభ నోటినుంచి వచ్చే విస్కీ వాసనా, శరీరపు ఇంటిమేట్ సువాసనా అతన్ని వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయ్!

"చలపతీ! మీలో నన్ను కరిగిపోనివ్వండి. మీ ఊహలకు నేను ఛాయనైతే నా జన్మ తరించినట్టే...." రంభ ఏవేవిటో అంటూ చలపతిని ఇంకా గట్టిగా కౌగలించుకుంది.

చలపతి ఏదో ఐపోతున్నాడు. శరీరమంతా వెచ్చగా, చలిమంట కాగుతున్నట్టుగా...

రంభ శరీరపు వొంపులూ, ఎత్తులూ మెత్తగా తగులుతూ ఈ లోకాన్ని మరచి ఆ లోకంలో (?) తృప్తి చెందాలని.

చలపతి రంభ వీపుమీద చేతులువేసి తన్మయత్వంగా "రంభా!" అన్నాడు. అంతే!

ఎవరో తన వీపుమీద కొరడాతో కొట్టినట్టుగా అనిపించి వెంటనే రంభను విడిపించుకున్నాడు చలపతి. "రంభా" అన్న పిలుపు ఇంటి దగ్గర తన భార్యను పిలిచినట్టుగా అనిపించింది. తన భార్యకు అన్యాయం చేస్తున్నట్టుగా బాధపడ్డాడు. అక్కడ, ఇంటి దగ్గర - భార్యా, ఇద్దరు పిల్లలూ తన రాకకోసం ఎదురుచూస్తూ వుంటారు. భార్యా పిల్లలు ఎలా వున్నారో?

అక్కడ భార్య తన రాకకోసం కిటికీ దగ్గర కూరుని ఎదురుచూస్తూ వుంటే. ఇక్కడ తను ఒక పరాయి ఆడదానితో పొందుకోసం తాపత్రయపడుతున్నాడు. "వివాహం" అనే బంధానికే "కళంకం" తీసుకొస్తున్నాడు. ఇది తప్పు. పొరపాటు! - రచయితగా తనే ఒకరికి చెప్పవలసింది పోయి—

ఈ ఆలోచనలు చలపతి మనస్సులో క్షణ క్షణానికీ బలపడసాగినయ్. వళ్ళంతా చెమట్లు పోసి, నిలువునా వణకసాగాడు. రంభకి దూరంగా జరిగి—

"రంభా! దయచేసి మీరు యిక్కడనుంచి వెళ్ళిపోండి. ప్లీజ్" అన్నాడు.

"అదేవిటి డార్లింగ్?" ఆశ్చర్యపోతూ అడిగింది.

"అవంతే....ముందిక్కడనుంచి వెళ్ళిపోండి."

"ఇప్పుడు, ఇక్కడ ఈ సమయంలో కూడా జోకేనా? రండి" అంటూ రంభ చలపతి చేతిని పుచ్చుకుంది.

చలపతి అసహ్యంగా ఆ చేతిని విడిపించుకుని—"గెటవుట్" అంటూ డోర్ తీసి వెళ్ళమన్నట్టుగా చూశాడు.

"ఈ రాత్రి సమయంలో కోరి వచ్చిన ఆడదాన్ని వెళ్ళమంటున్నావా? నువ్వు మగాడివేనా?"

"నీముందు నేను మగాణ్ని కాకపోయినా ఫరేదు. ముందు బయటకు వెళ్ళు." అంటూ రంభను బయటకు తోసేసి డోర్ వేసేశాడు!

చలపతి అద్దం దగర కొచ్చి అందులో తన ముఖం చూసుకున్నాడు. ఆ ముఖం తనకే ఆశ్చర్యంగా వుంది!

ఆ రాత్రి చలపతి గొప్ప తృప్తిగా, ఏదో సాధించినంత మహదానందంగా, భార్యా, పిల్లలనూ తలచుకుంటూ పడుకున్నాడు.

పడుకోబోయె ముందు అనుకున్నాడు -

"సాధ్యమైనంత తొందరలో ఈ సినిమాకి డైలాగ్స్ రాసిచ్చి వెళ్ళిపోవాలని!"

* * *

చలపతి పట్టుదలతో అనుకున్న దానికంటే ముందుగానే డైలాగులు రాసి యింటికి బయలుదేరాడు!

రైల్లో రిజర్వేషన్ సీట్లో కూర్చున్న చలపతికి మనస్సు మనస్సులో లేదు! అతని


బనియన్‌ల చరిత్రలో స్వర్ణయుగం సృష్టించిన సంస్థ ఛాంపియన్!

IS: 4964
ISI
EMERALD



CHAMPION
(Regd)

ఉత్పత్తిదారులు ఛాంపియన్ నిట్టింగ్ కంపెనీ
తిరుపూర్-638602 (తమిళనాడ్)
ఆంధ్రప్రదేశ్‌కు ఏజెంట్లు: ప్రభాకర టెక్స్‌టైల్ ఏజన్సీస్
వస్త్రలత 133, విజయవాడ
నటకల వేణుగోపాల్, చిత్తూరు (చిత్తూరు జిల్లాకు మాత్రమే)




మన్నిక, నాణ్యత గలవి
ఛాంపియన్
బనియన్‌లు

ఆలోచనలూ, ఊహలూ ఇంటిమీదనే వున్నాయి.

అనుకున్న దానికంటే నాలుగు రోజులు ముందుగానే యింటికి వస్తున్నాడు. తనను చూడగానే భార్య ఎలా ఆశ్చర్యపోతుందో? భార్యను ఆశ్చర్యాన్నుంచి తేరుకోకముందే దగ్గరకు తీసుకుని- తనివితీరా....

చలపతి నవ్వుకున్నాడు. నవ్వుకున్నాడన్న మాటేగానీ, ఆ నవ్వులో రంభ కనిపించినట్టుగా ఫీలయ్యాడు!

ఆ రోజు రాత్రి హోటల్ గదిలో రంభను గనుక తను అనుభవించి, నరాల తీపిని వొదిలించుకున్నట్టయితే—తన స్థితి ఎలా వుండేది?—అనుక్షణం ఏదో చెయ్యరాని నేరం చేసినటుగా బాధపడిపోతూ. భార్యతో సుఖంగా వుండలేకపోయేవాడు.

ఒక గొప్ప అందగత్తె, సౌందర్యరాశి, పేరుప్రఖ్యాతులున్న డాన్సర్ కోరి, తనంతట తానుగా తన గదికొస్తే తిరస్కరించాడు.

జీవితంలో ఇది చాలా గొప్ప విషయం! బహుశా, ఏ మగవాడూ ఇలా నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించి వుండడు. కాని, తను, జీవితంలో ఏర్పరచుకొన్న కొన్ని నిర్ణయాలకూ, ఆశయాలకూ అనుగుణంగా నడుచుకుంటూ వొచ్చాడు. అందుకే, ఈ క్షణంలో కూడా తనకెంతో తృప్తిగా వుంది. ఎవరూ జయించలేని ఒక మహోన్నతమైన కార్యాన్ని తను అవలీలగా జయించినట్టుగా అనుభూతి చెందసాగాడు!

అక్కడ జరిగిందంతా, తను రంభను ఎలా తిరస్కరించి, బయటకు గెంటిందీ భార్యకు వివరంగా చెప్పాలి. అప్పుడు భార్య ముఖంలో వెలిగే సంతోషం తను గుర్తించాలి.

చలపతి ఆలోచనలకు అంతరాయాన్ని కలిగిస్తూ స్టేషన్లో రైలు ఆగింది. తను దిగవలసిన స్టేషనే.

చలపతి గబగబా సూట్‌కేస్ పట్టుకుని రైలు దిగాడు. టైమ్ చూసుకున్నాడు. రాత్రి రెండుగంటలు కావస్తోంది. స్టేషన్లో పెద్ద కోలాహలంగా లేకపోయినా సందడిగానే వుంది.

చలపతి బయటకొచ్చి నుంచున్నాడు. అతనికి విపరీతమైన ఆకలిగా వుంది. హోటల్‌కెళ్ళి ఏదైనా తిందామనుకున్నాడు. సమయంకాని సమయంలో, అదీ తను వొస్తున్నట్టు తెలియజేయకుండా యింటికి వెడుతున్నాడు. ఇంటి దగ్గర తినడానికి ఏం వుండకపోవచ్చు.

చలపతి హోటల్లో కెడదామని రెండు మూడుసార్లు అనుకుని విరమించుకున్నాడు. ఈ ఆకలి కంటే త్వరగా యింటికెడితేనే బావుంటుందనుకున్నాడు. అలా అనుకున్న క్షణంలోనె చలపతి రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా ఇంటి ముందాగింది.

ఆ సందంతా నిర్మానుష్యంగా వుంది.

ఎక్కడా ఏ అలికిడీ కావడంలేదు.

వీధిలో లైట్లు కాకిలా చూస్తున్నాయి.

సందు చివర మలుపులో కుక్కొకటి కుయ్యోకుయ్యో అంటూ యేడుస్తోంది. చలపతి గేటు తీసుకుని లోపలికెళ్ళాడు.

అంతా చీకటిగా వుంది.

సన్నజాజుల పరిమళం మట్టుకు మత్తెక్కిస్తోంది.

మెట్లెక్కి వెళ్ళి తలుపు తడుతూ భార్యను పిలిచాడు.

రెండు కేకల్లోనే భార్య వొచ్చి తలుపు తీసి, చలపతిని చూసి ఆశ్చర్యపోయి.

"అదేవిటి? మీ రెప్పుడో వస్తానన్నారు. అప్పుడే వొచ్చేశారే?" అంటూ ప్రశ్నించింది.

"అవును గీతా వొచ్చేశాను వుండబుద్ధి కాలేదు. తినడానికేమైనా వుందా?"

"లేదండి. మీరు వస్తారని నాకు తెలియదుగా.... అందుకని."

"సరే పోన్లే." అంటూ భార్యను గదిలోకి తీసుకెళ్ళి దగ్గరకు తీసుకోబోయాడు.

"ఈ టైమ్‌లో ఏవిటండీ? హాయిగా పడుకోక" అంటూ భర్తను విడిపించుకుని, ఒక ప్రక్కకు తిరిగి పడుకుంది.

"గీతా, నీ కెన్నో చెప్పాలి. అసలక్కడ ఏం జరిగిందో తెలుసా?"

"ఇప్పుడేం వొద్దులెండి. పడుకోండి."

భార్య యింక ఎంతసేపటికీ మాట్లాడకపోవడంతో, చలపతి గత్యంతరంలేక కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

గీత పడుకున్నదన్న మాటేగానీ ఆమెకు నిద్రరావడం లేదు!

వొళ్ళంతా నొప్పులుగా, అలసటగా, తీరిన తృప్తిగా వుంది! ఆ తృప్తిలో ఎదురింటి స్టూడెంటు కుర్రాడు అందంగా నవ్వుతూ కనబడుతున్నాడు.

అప్పుడు గీత ఇలా అనుకున్నది—

"ఇంకా నయం గంట క్రితమే ఆ కుర్రాడు ఈ గదిలోంచి వెళ్ళిపోయాడు! లేకపోతే ఏం జరిగేదో?"

ఒకవేళ గీత వ్యవహారం బయటపడితే—

ఇటువంటి కథలకు ముగింపు ఏ రకంగా వుంటుందో చెప్పడం కష్టం,

"ప్రతి మనిషీ తన మనస్సులోని కోర్కెలను బయటపెడితే ఈ ప్రపంచం ఒక్కసారే భగ్గుమండుతుంది."— అని ఎవరో రచయిత అన్నాడు.

ఇది నిజమేనేమో.

అదిగో!

గీతకు నిద్ర ముంచుకొస్తోందనుకుంటాను. కళ్ళు మూసుకుంటోంది.

చూద్దాం! తెల్లారితే ఏం జరుగుతుందో.

★

## ఆనందమార్గం

### చీమ స్మృతులు

ఓ సువిశాలమైన బట్టతల మీద నడుస్తున్న తల్లిచీమ పక్కనున్న పిల్లచీమకు తన అనుభవాల గురించి చెబుతూ—"నేను నీ అంత వుండగా ఇక్కడ సన్నటి కాలిదారి మాత్రమే వుండేది."

★

### పశు వైద్యం

బాగా డబ్బున్న ఆసామి డాక్టర్ కోసం కబురెట్టాడు. డాక్టరు వెళ్ళి ఏమిటి తమ బాధ అని అడిగితే —

"అదే నువ్వు కనిపెట్టాల్సింది" అన్నాడు ఆసామి కొంచెం హుందాగా—

"అహా, అలాగా. అట్లా అయితే నా మిత్రుణ్ని కబురెడదాం—వాడైతే రోగి చెప్పకుండానే కేసు పసిగట్టగలడు, వాడు పశువైద్యుడు...." అని డాక్టర్ జవాబిచ్చాడు.

★

మీరు సంపాదించాలని కలలు కన్న సొమ్మును పన్నుల రూపంలో ప్రభుత్వం కైంకర్యం చేయటాన్నే ఈ రోజుల్లో వ్యాపారంలో విజయం అంటారు.

★

"నాకు పదహారేళ్ళ వయసులో బాత్రూంలో అద్దం ముందు ఇరవై ఒక్కేళ్ళ యువతిలా కనపడాలని అరగంట అలంకరించుకునేదాన్ని. నాకిప్పుడు నలభై రెండు. ఇప్పుడు కూడా ఇరవై ఒక్కేళ్ళ యువతిలా కనపడాలనే తాపత్రయమంతా"—అంది ఓ ప్రఖ్యాత నవలా రచయిత్రి.

★

"ఈ వూర్లో కెల్ల పెద్ద లోఫర్లం మేమే" అని ఓ రొట్టెల దుకాణంవాడు తేజ్‌పూర్‌లో బోర్డు కట్టుకున్నాడు.